క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

● రూరల్ ఏఈ పి.రామారావు

పార్వతీపురం రూరల్: మండలంలోని నర్సిపురం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియ, మెయింటనెన్స్ పనుల్లో భాగంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నర్సిపురం గ్రామంతో పాటు వసుంధరనగర్, వైకేఎం కాలనీ, ఓలేటి ఫారం, వెంకంపేట గ్రామాలకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్లు పార్వతీపురం మండల విద్యుత్‌శాఖ ఏఈ రామారావు తెలిపారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని కోరారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక హారతి



సంగంవలసలో నగర సంకీర్తనలో రామభక్తులు

పార్వతీపురం రూరల్: మండలంలోని సంగంవలస గ్రామంలో రామమందిరం వద్ద భక్తులు గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించి సామూహిక హారతి ఇచ్చారు. గురువారం వైశాఖ శుద్ధ ఏకాదశి సందర్భంగా శ్రీరామ భజనమండలి సభ్యుల ఆధ్వర్యంలో వేకువ జామున సంగంవలస గ్రామ పురవీధుల్లో జైశ్రీరామ్ నామాన్ని స్మరిస్తూ నగర సంకీర్తన నిర్వహించి భక్తుల్లో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేకాలంకరణ



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహ స్వామిని గురువారం ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులతో ముడుపుల పూజలు ఈ సందర్భంగా ఘనంగా జరిగాయి. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసాచార్యులు పర్యవేక్షణలో అర్చక బృందం నిర్వహిస్తున్న ముడుపుల పూజల్లో వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి పాల్గొంటున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో క్యూలో నిలబడి కార్యక్రమాల్లో పాల్గొన్నారని అర్చకుడు శ్రీనివాసాచార్యులు తెలియజేశారు.

తొలగని ముసుగు



తోణాం గ్రామంలో ముసుగువేసి ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం

సాలూరు రూరల్: ఎన్నికల కోడ్ ప్రకటించగానే ఫ్లెక్సీలు, నాయకుల విగ్రహాలకు ముసుగులు వేయడం ఎన్నికల కోడ్. ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే ముసుగులు తొలగిస్తారు. అయితే సాలూరు మండల అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారనే చెప్పవచ్చు. మండలంలోని తోణాం గ్రామంలో ఉన్న దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి వేసిన ముసుగులను ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ తొలగించలేదు. ఇప్పటికైనా నేతల విగ్రహాలపై ముసుగులు తొలగించాలని పలువురు కోరుతున్నారు.

తారెత్తిస్తున్న ఎండలు



కొంగును తలపై కప్పుకుంటూ వస్తున్న ఉపాధి వేతనదారులు

పాలకొండ రూరల్: పగటి ఉష్ణోగ్రతలు తీవ్రస్థాయికి చేరుకోవడంతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వడగాడ్పులతో కూడిన ఎండలకు బయటకు రావాలంటేనే హడలిపోతున్నారు. గురువారం 40 డిగ్రీలకు పైబడి ఉష్ణోగ్రత నమోదు కావడంతో ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ప్రధాన రహదారులతో పాటు గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు, నగర పంచాయతీ వీధులు నిర్మానుష్యంగా దర్శనమిచ్చాయి. ఉపాధి పనులకు వెళ్లే వేతనదారులు తలపై కొంగులు కప్పుకుంటూ రాకపోకలు సాగించారు. ఎండలు అధికంగా ఉండడంతో వడదెబ్బ తగిలే అవకాశం ఉన్నందున, అప్రమత్తంగా ఉండాలని ఫైర్ ఆఫీసర్ జామి సర్వేశ్వరరావు సూచించారు.

గిరిజనుల వైద్యంపై నిర్లక్ష్యం..!

● 26వేల మంది ప్రజలకు ఒక్కరే వైద్యుడు
● అనారోగ్యాలతో నంచి వైద్యులను ఆశ్రయిస్తున్న గిరిజనులు

సాలూరు:

గిరిజన సంక్షేమం, స్త్రీశిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రాతినిధ్యం వహిస్తున్న సాలూరు నియోజకవర్గంలోని సాలూరు మండలంలో గిరిజనుల వైద్యంపై ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని పలువురు గిరిజనులు వాపోతున్నారు. సాలూరు మండలంలోని తోణాం పీహెచ్‌సీ పరిధిలో తోణాం, పట్టుచెన్నేరు, పగులుచిన్నేరు, గంజాయిభద్ర, డెన్సరాయి, కొదమ, సారిక, కురుకూటి, సంపంగిపాడు, జిల్లేడువలస తదితర సుమారు 12 గిరిజన పంచాయతీల్లో సుమారు 26 వేల మంది ప్రజలు ఉన్నారు. అధికంగా గిరిశిఖర గ్రామాలున్నాయి. ఇన్ని వేల మంది ప్రజలున్న తోణాం పీహెచ్‌సీకి కేవలం ఒకే ఒక్క వైద్యుడు ఉండడం విశేషం. దీంతో ఆ వైద్యుడు ప్రతిరోజు ఓపీ చూడడానికే సమయం చాలని పరిస్థితి నెలకొంది. పీహెచ్‌సీకి వచ్చే డెలివరీ, మలేరియా, విష జ్వరాల కేసులకు వైద్యం అందించడం ఆ ఒక్క డాక్టర్‌కు చాలా కష్టంగా మారింది. రోజుకు సుమారు 70 నుంచి 150 మధ్య ఓపీ ఉంటుందంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మరోవైపు గిరిశిఖర గ్రామాల్లో తాగునీరు లేక స్థానిక వాగుల్లోను చెలమల నీటిమీద ఆధారపడుతున్న నేపథ్యంలో కలుషిత నీరు తాగుతుండడం, భానుడి తాపం తదితర కారణాలతో గిరిజనులు అనారోగ్యాల బారిన పడుతున్నారు.



తోణాం పీహెచ్‌సీలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు డా.అజయ్



డాక్టర్ లేకుండా గిరిజన గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహిస్తున్న సిబ్బంది

అయితే వారు స్థానిక నంచి వైద్యులను ఆశ్రయిస్తుండగా, గిరిజనుల అమాయకత్వం అసరాగా అనారోగ్యాన్ని బూచిగా చూపించి పలువురు నంచి వైద్యులు సొమ్ము చేసుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

గతంలో ఇద్దరు వైద్యులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో, ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర ఆధ్వర్యంలో సాలూరు నియోజకవర్గంలో వైద్యానికి పెద్దపీట వేశారు. ఆరోగ్య సురక్ష వంటి కార్యక్రమాల ద్వారా ప్రజల వద్దకే స్పెషలిస్ట్ వైద్యులు వచ్చి పరీక్ష చేసి మందులు అందించేవారని ప్రజలు గుర్తు చేసుకుంటున్నారు. తోణాం పీహెచ్‌సీలో గత ప్రభుత్వంలో ఇద్దరు వైద్యులు ఉండేవారు. ఒకరు పీహెచ్‌సీలో ఓపీ చూడగా, మరో వైద్యుడు పీహెచ్‌సీ పరిధిలోని గ్రామాలకు వెళ్లి వైద్యశిబిరాలు నిర్వహించేవారు. కాగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇటీవల పీహెచ్‌సీలో ఉన్న వైద్యురాలు ఉన్నతచదువుల నిమిత్తం వెళ్లిపోయారు. ఇన్ని వేల మంది జనాభా ఉన్న ఈ పీహెచ్‌సీకి ఆమె స్థానంలో మరో వైద్యుడి నియామకం నెలలు దాటుతున్నా ఉన్నతాధికారులు చేపట్టలేదు. దీంతో ఇక్కడి గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం: ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏపీఎస్ ఆర్టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం డిపో ఆవరణలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, బి.సూరిబాబులు మాట్లాడుతూ కార్మికులు ఎనిమిది గంటలు పనిచేయాల్సి ఉన్నప్పటికీ కాంట్రాక్ట్ కార్మికులను భయపెట్టి 24 గంటలు వరకు డ్యూటీలు చేయించడం కార్మిక చట్టాన్ని ఉల్లంఘించడమేనన్నారు. పనిచేస్తున్న సమయంలో యాజమాన్యం కార్మికులను మానసికంగా వేధించడం సరికాదన్నారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపో మేనేజర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ యూనియన్‌ల మధ్య జరిగిన చర్చల ప్రకారం జీతాలు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో పలువురు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు పాల్గొన్నారు.



డిపో ఆవరణలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ వర్కర్స్

ప్రమాదపుటంచున ప్రయాణం

పార్వతీపురం రూరల్: అవగాహన లేకనో లేక తమకేమీ కాదన్న నిర్లక్ష్యమో కొందరి ఆలోచనలు నిండు ప్రాణాలను గాలిలో కలిపేసే దురదృష్టకర ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో సరుకులు తరలించే వాహనాల్లో ప్రజలను పరిమితికి మించి ఎక్కించి ప్రమాదపుటంచున ప్రయాణాలు సాగిస్తున్నారు. మూడు చక్రాలున్న వాహనాల్లో పరిమితికి మించి ప్రజలను రవాణా చేసి నిబంధనలను ఉల్లంఘిస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రజలను వాహనాల్లో ఎక్కిస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ ఆటో డ్రైవర్లలో ఎలాంటి మార్పు కానరావడం లేదు. ఇదిలా ఉండగా ప్రజలు కూడా ముందుగా గమ్యానికి త్వరగా చేరాలనే ఉద్దేశంతో నిబంధనలను సైతం లెక్కచేయకుండా ఏ వాహనం కనబడితే అందులో ఎక్కి రాకపోకలు సాగిస్తున్నారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల సమీపంలో వస్తువులు రవాణా చేసే వాహనంలో ప్రజలను తరలిస్తున్న దృశ్యం సాక్షి కెమెరా కంటపడింది.



వస్తువులను తరలించే వాహనంలో పరిమితికి మించి ప్రయాణికులు

ముగిసిన ఆలయ ప్రతిష్ఠ

పార్వతీపురం రూరల్: మండలంలోని మడకవానివలసలో మంగళవారం నుంచి నిర్వహించిన శ్రీ రామమందిర ప్రతిష్ఠ మహోత్సవం గురువారం ముగిసింది. ప్రతిష్ఠ మహోత్సవంలో భాగంగా గురువారం హనుమత్ సహిత సీతారామ లక్ష్మణుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తుల నడుమ అర్చకులు బ్రహ్మశ్రీ పుల్లే కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం శ్రీ సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు అధికంగా పాల్గొనగా కల్యాణం అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు అవసరమైన ఏర్పాట్లు చేశారు.



సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు

ఘనంగా బంగారమ్మ తల్లి పండగ



బంగారమ్మ తల్లి పండగలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: మండలంలోని మిర్తివలస గ్రామంలో గురువారం బంగారమ్మ తల్లి పండగను ఘనంగా నిర్వహించారు. 15 ఏళ్ల తర్వాత నిర్వహించిన పండగ కావడంతో చుట్టాలు, బంధువులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. పండగలో చేపట్టిన బాణసంచా, బళ్ల వాలకాలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పండగలో పాల్గొని అమ్మవారి ఘటాలకు మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల ఇళ్లకు వెళ్లారు. రాజన్నదొర వెంట ఎంపీపీ ప్రతినిధి పాచిపెంట వీరంనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాల నాయుడు, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, పార్టీ నాయకులు సేనాపతి నారాయణరావు దండి కొండలరావు, మీసాల ఆదినారాయణ ఉన్నారు.

సాలూరులో నేడు విద్యుత్‌కు అంతరాయం

సాలూరు: పట్టణం, మండలంలో శుక్రవారం విద్యుత్‌సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీ ఈపీడీసీఎల్ ఈఈ గోపాలరావునాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్‌లైన్లకు దగ్గరగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగించే పనులు చేపట్టనున్న సందర్భంగా 11కేవీ పాలిటెక్నిక్ ఫీడర్, నెలివర్తి 11కేవీ వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలో ఉన్న పట్టణం, మండలంలోని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

పండగను ఘనంగా జరుపుకోవాలి

సాలూరు: శ్యామలాంబ పండుగ సమయంలో ప్రజలందరూ శాంతిభద్రతలకు సహకరిస్తూ, పండగను ఘనంగా జరుపుకోవాలని పట్టణ సీఐ అప్పలనాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని డబ్బివీధి, వడ్డివీధి తదితర ప్రాంతాల్లో ఆయన ప్రజలతో మాట్లాడారు. పండగ సమయంలో శాంతిభద్రతలు, ట్రాఫిక్ తదితర నియమాల గురించి వివరించారు. సిరిమాను, తొలేళ్ల ఉత్సవంలో శాఖాపరమైన అంశాలపై ప్రజలకు సూచనలు జారీ చేశారు. అందరి సహకారంతో పండగను ఘనంగా జరుపుకోవాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు.



మాట్లాడుతున్న సీఐ అప్పలనాయుడు

సచివాలయంలో డిజిటల్ సహాయకులు లేక ఇబ్బందులు

సీతానగరం: మండలంలోని పెదభోగిలి సచివాలయం-1లో డిజిటల్ సహాయకురాలు లేకపోవడంతో వివిధరకాల పనులతో వచ్చిన ప్రజలు సాయంత్రం వరకు ఉండి తిరుగుముఖం పట్టాల్సి వచ్చిందని కార్మిక నాయకుడు, సీనియర్ సిటిజన్ ఎస్.కొండలరావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సచివాలయం వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ సచివాలయం పరిధిలో ఉన్న ప్రజలకు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల నిమిత్తం, సీనియర్ సిటిజన్ కార్డుల నిమిత్తం, రేషన్‌కార్డులలో సవరణలు, చేర్పులు, మార్పులు చేసుకోవాలని ప్రభుత్వ పాలకులు మార్గదర్శకాలు ఇచ్చారన్నారు. అన్నీ ఇచ్చినా ఆన్‌లైన్ చేయాల్సిన డిజిటల్ సహాయకురాలు లేకపోవడం, ఆన్‌లైన్ నెట్‌సర్వీసులు పని చేయకపోయినా అధికారులు పట్టించుకోలేదని ఆరోపించారు. తక్షణమే నెట్ సర్వీసులు పనిచేసేలా, స్థానికంగా విధులు నిర్వహించే డిజిటల్ సహాయకురాలు మెటర్నటీ లీవ్‌పై వెళ్లడంతో ఆమె స్థానంలో వేరే డిజిటల్ సహాయకుడిని ప్రభుత్వం నియమించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలి



కలెక్టరేట్ వద్ద నిరసన తెలుపుతున్న డీఎస్సీ అభ్యర్థులు

పార్వతీపురంటౌన్: డీఎస్సీ అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని నిరుద్యోగ అభ్యర్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మాట్లాడుతూ డీఎస్సీ నిరుద్యోగ అభ్యర్థుల సమస్యలైన జీఓ నంబర్ 51 ప్రకారం టెట్ నిర్వహించి తద్వారా మెగా డీఎస్సీలో అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. డీఎస్సీకి ప్రిపరేషన్ సమయం 90రోజులు దాటి ఉండాలని, ఒకే జిల్లా ఒకే పేపర్, వయస్సు 48 సంవత్సరాలు ఓసీలకు పెంచాలని కోరారు. డిగ్రీలో 50శాతం విధానం తగ్గించాలని ప్రధానంగా కోరుకుంటున్నామన్నారు. దాదాపు 3లక్షల మంది టెట్ క్వాలిఫై కాని అభ్యర్థులు ఉన్నారని, టెట్ ప్రతి సంవత్సరంలో రెండు సార్లు నిర్వహించాలని డిమాండ్ చేశారు. 2025లో ఇప్పటికి ఒకసారి కూడా టెట్ నిర్వహించలేదని, 3లక్షల మంది అభ్యర్థులకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

దేశ చరిత్ర మార్గదర్శకం

పాలకొండ రూరల్: దేశ చరిత్ర మార్గదర్శకమని స్థానిక శాఖా గ్రంథాలయ అధికారి బి.గణేష్‌బాబు అన్నారు. గురువారం స్థానిక గ్రంథాలయ శిక్షణ శిబిరంలో విద్యార్థులకు దేశ, రాజరికపు వ్యవస్థ, నాయకులు, మార్గదర్శకుల చరిత్రపై అవగాహన కల్పించారు. అనంతరం తంపటాపల్లి డ్రాయింగ్ ఉపాధ్యాయుడు జి.మురళి షాడో చిత్రలేఖనంపై తర్ఫీదు ఇచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఎం.వెంకటరమణ, బి.వాసు సహకరించారు.



శిబిరంలో తర్ఫీదు పొందుతున్న విద్యార్థులు

సాగునీటి కాలువలపై దృష్టి సారించాలి

● జంఝావతి కాలువను పరిశీలించిన కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: ఖరీఫ్‌కు ముందే జిల్లావ్యాప్తంగా ఉన్న కాలువలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టి సారించాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం ఆ పార్టీ నాయకుడు వి.దాలినాయుడు స్థానిక నాయకులతో కలిసి గోపాలపురం-కొత్తవలస గ్రామాల మధ్యలో ఉన్న జంఝావతి కాలువను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలువ మొత్తం పూడికలతో, పిచ్చిమొక్కలు, తుప్పలు, డొంకలతో అస్తవ్యస్తంగా ఉందని వాటితో నిండిన కాలువ ఆనవాళ్లు లేకుండా పోయిందన్నారు. సాగునీటి కాలువలపై ఇంత నిర్లక్ష్యంగా సంబంధిత అధికారులు వ్యవహరించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కాలువల్లో పూడికలను తీసే పరిస్థితి లేనట్లు దర్శనమిస్తోందని వాపోయారు. ప్రతి ఏడాదీ పొలాలకు కాలువ ద్వారా నీరు అందడం లేదంటూ రైతులు తమ వద్ద ఆవేదన చెందినట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు నైరుతి రుతుపవనాలు వచ్చే అవకాశం ఉన్నందున తక్షణమే పూడికలు తీసి సాగునీటి కాలువలను సిద్ధం చేయాలని డిమాండ్ చేశారు. అకస్మాత్తుగా అకాల వర్షాలు కురిస్తే ఏ విధంగా పూడిక తీత పనులు చేపడతారో అధికారులే ఆలోచించాలన్నారు. జంఝావతి కాలువతో పాటు తోటపల్లి కుడి ఎడమ, వెంగళరాయ కాలువలు, పెదంకలాం, రావాడ తదితర డ్యామ్‌లకు సంబంధించిన పంట పొలాలను కాలువలను ప్రస్తుత సీజన్‌కు ముందే సిద్ధం చేయాలని ఇరిగేషన్ అధికారులను డిమాండ్ చేశారు. సాగునీటి కాలువల్లో చిట్టచివరి పొలం వరకు నీరు అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ విషయమై కలెక్టర్ చొరవ చూపాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలనలో జి. రామకృష్ణ, టి.గౌరీశంకరరావు తదితరులు పాల్గొన్నారు.



తుప్పలు, డొంకలతో నిండి ఉన్న జంఝావతి కాలువలను చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

సాలూరులో నేడు డయల్ యువర్ డీఎం

సాలూరు: డయల్ యువర్ డీఎం కార్యక్రమం సాలూరులో శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆర్టీసీ డీఎం బీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఆర్టీసీ సర్వీసులపై ప్రజలు, ప్రయాణికులు ఏవైనా ఫిర్యాదులు, సూచనలు, సలహాలు ఇవ్వవచ్చన్నారు. ఉదయం 11 గంటల నుంచి 12 గంటల మధ్య ఫోన్ 99592 25622 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.



ఆర్టీసీ డీఎం బీఎస్ఎన్ మూర్తి

డయల్ యువర్ డీఎం రేపు

పార్వతీపురంటౌన్: డయల్ యువర్ డీఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ ఈఎస్‌కే కనకదుర్గ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 10న ఉదయం 11 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొంటూ పార్వతీపురం డిపో పరిధిలో ప్రజారవాణా సమస్యలపై ఫోన్ 9959225621 నంబర్‌కు కాల్ చేయాలని సూచించారు.

రూ. 50 లక్షలతో లైటింగ్

వీరఘట్టం: సుడా పరిధిలో ఉన్న వీరఘట్టం పట్టణ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తున్నామని, ప్రధాన రహదారిలో సెంటర్ లైటింగ్ ఏర్పాటుకు రూ.50 లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తెలిపారు. ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, సుడా ఇంజినీరింగ్ అధికారులతో కలసి వీరఘట్టం ప్రధాన రహదారిని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ అధికారులు ఈ రోడ్డులో ఎన్ని లైట్లు పడతాయో పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేశారని, కొద్ది రోజుల్లో పనులు ప్రారంభిస్తామని రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు జామి లక్ష్మీనారాయణ, బల్లా హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ఠ



స్వామివారికి కలశ పూజలు చేస్తున్న భక్తులు

సీతానగరం: మండలంలోని అంటిపేట పంచాయతీ వెంకటాపురం గ్రామంలో అభయాంజనేయ స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవ ఘనంగా నిర్వహించారు. గ్రామ పురోహితులు, వేద పండింతులు గన్నవరపు కామేశ్వరరావు ఆధ్వర్యంలో గన్నవరపు శ్రీనివాసరావు, కె.ప్రసాద్‌శర్మ అర్చక బృదం మంగళవారం ఉదయం విఘ్నేశ్వర పుణ్యాహవచనంతో ప్రారంభించి దీక్షా మహాసంకల్పం చేసి నాలుగు వేదాలకు చెందిన వేద పారాయణం గావించారు. సాయంత్రం నాలుగు గంటలకు శోభాయాత్రతో ప్రారంభించి పూర్ణ కలశాలతో జలాభిషేకం, ధాన్యాధివాసం చేశారు. బుధవారం ఉదయం రుద్రాభిషేకం, సామూహిక కుంకుమార్చన పూజలు జరిగాయి. ఉత్సవకమిటీ సభ్యులు, గ్రామ పెద్దల సహకారంతో హనుమాన్ యూత్ కమిటీ స్ఫూర్తిగా తీసుకుని ఆలయం నిర్మించడంతో గ్రామ పెద్దలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ మహోత్సవాల్లో ప్రాణ ప్రతిష్ఠ చేయనున్నామని, అప్పటినుంచి అభయాంజనేయుడు భక్తులకు దర్శనం ఇవ్వనున్నారని వేదపండితులు తెలిపారు. గురువారం అభయాంజనేయస్వామి వారి ప్రతిష్ఠ, కార్యక్రమంలో భాగంగా కళాన్యాసాలు, విగ్రహావిష్కరణ, మంత్రస్థాపన, పూర్ణకలశ స్థాపన, హోమానంతర పూర్ణాహుతి కార్యక్రమాలు జరిగాయి అనంతరం గో విగ్రహదర్శనంతో భక్తులకు స్వామివారి తొలి దర్శనా న్ని అర్చకులు అందించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ జరిగింది.



పూజలందుకుంటున్న స్వామివారు

భూ వివాదం పరిష్కారానికి చర్యలు

సీతంపేట: మండలంలోని బిల్లమడ ప్రాంతంలో నెలకొన్న జిరాయితీ భూ వివాదం పరిష్కారానికి చర్యలు తీసుకున్నట్లు తహసీల్దార్ అప్పలరాజు తెలిపారు. ఈ మేరకు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది భూమి వద్దకు వెళ్లి గురువారం హద్దురాళ్లు వేశారు. వివరాల్లోకి వెళితే.. వెంకటపతిరాజు, ఆయన కుటుంబ సభ్యులకు 107 ఎకరాల జిరాయితీ సాగు భూమి ఉంది. దీనిలో బిల్లమడ గ్రామ పరిధిలో ఉన్న గిరిజనులకు 50 ఎకరాల వరకు ఉచితంగా మూడేళ్ల కిందట వెంకటపతిరాజు పంపిణీ చేశారు. మిగతా భూమిని ఇతర గ్రామాలకు చెందిన వ్యక్తులు ఆక్రమించడంతో బాధితుడు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అధికారుల సూచనల మేరకు పోలీసుల సమక్షంలో జిరాయితీ భూమి కలిగిన హక్కుదారునికి హద్దులు వేసి స్వాధీన పరిచారు. కార్యక్రమంలో ఆర్ఐ విజయగణేష్, డీఎస్పీ ఎం.రాంబాబు, సీఐ చంద్రమౌళి, ఎస్సైలు అమ్మన్నరావు, మస్తాన్, అనిల్‌కుమార్, ఏఎస్సై సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.